


EVENING EDITION

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

4PM

www.suryaa.com

మంగళవారం

10-02-2026

పేజీలు: 02

## డీకేని సీఎంను చేయాలని హైకమాండ్‌కు 80 మందికిపైగా ఎమ్మెల్యేల అభ్యర్థన


కర్ణాటకలో సీఎం పోస్టుపై మాటిమాటికి ఊహాగానాలు వినిపిస్తూనే ఉన్నాయి. సీఎం సిద్ధరామయ్యను పదవి నుంచి తొలగించి డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ కు సీఎం పగ్గాలు కట్టబెడుతారని మరోసారి పుకార్లు షికార్లు చేస్తున్నాయి. డీకే శివకుమార్‌ను సీఎంను చేయమని 80 మందికిపైగా ఎమ్మెల్యేలు హైకమాండ్‌కు అభ్యర్థన చేసినట్లు ప్రచారం జరుగుతోంది. తాజాగా ఈ విషయాన్ని ఎమ్మెల్యే ఇక్బాల్ హుస్సేన్ వెల్లడించడం చర్చనీయాంశంగా మారింది. సీఎం పదవి విషయంలో డీకే శివకుమార్‌కు ఒక ఛాన్స్ ఇవ్వాలని 80 నుంచి 90 మందికిపైగా ఎమ్మెల్యేలు హైకమాండ్‌ను అభ్యర్థించారని ఇక్బాల్ హుస్సేన్ చెప్పారు. ఇప్పుడు ఈ నిర్ణయం అధిష్ఠానం చేతుల్లోనే ఉందని అన్నారు. తమది క్రమశిక్షణ కలిగిన పార్టీ అని, దానికి తగ్గట్టే తాము ప్రవర్తించాలని చెప్పారు. ఆయన (సిద్ధరామయ్య కొడుకు యతీంద్ర సిద్ధరామయ్యను ఉద్దేశించి) తన తండ్రికి అనుకూలంగా పదేపదే మాట్లాడటం ఇబ్బందిగా ఉందని అన్నారు. రాజకీయాల విషయానికి వస్తే.. క్రమశిక్షణే ముఖ్యమని ఇక్బాల్ హుస్సేన్ అన్నారు. తమ వ్యాఖ్యలతో ఇతరులను రెచ్చగొట్టాలని చూడటం సరికాదని చెప్పారు. డీకేకు ఒక అవకాశం ఇవ్వాలనేది తమ అందరి కోరిక అని తెలిపారు. అయితే దాని గురించి బహిరంగంగా ప్రకటనలు చేసి, గందరగోళం సృష్టించకూడదని అన్నారు.





## ‘బస్తర్’ సాంస్కృతిక వైభవం: ప్రధాని మోదీ

ఛత్తీస్‌గఢ్‌లో ఇటీవల జరిగిన ‘బస్తర్ పండుమ్’ ఉత్సవాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఫిబ్రవరి 7 నుంచి 9 వరకు జరిగిన ఈ వేడుకలు బస్తర్ ప్రాంతపు అద్భుతమైన సంస్కృతిని, గిరిజన వారసత్వాన్ని ప్రపంచానికి చాటిచెప్పాయని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలకు, నిర్వాహకులకు పీఎం తన హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఒకప్పుడు బస్తర్ పేరు వింటే మావోయిజం, హింస, వెనుకబాటుతనం గుర్తుకు వచ్చేదని, కానీ నేడు ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ప్రస్తుత బస్తర్ అభివృద్ధి పథంలో దూసుకుపోతూ, స్థానిక ప్రజల ఆత్మవిశ్వాసానికి చిరునామాగా నిలుస్తోందని ఆయన అన్నారు. మన సాంస్కృతిక మూలాలను కాపాడుకోవడంలో ఇటువంటి ఉత్సవాలు కీలక పాత్ర పోషిస్తాయని, రానున్న కాలంలో బస్తర్ శాంతి, ప్రగతితో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు.



## అత్తాపూర్ కార్ షోరూమ్‌లో అగ్నిప్రమాదం

హైదరాబాద్‌లోని అత్తాపూర్ పిల్లర్ నం.185 వద్ద ఉన్న సుజుకి షోరూమ్ సర్వీస్ సెంటర్లో మంటలు చెలరేగి మూడు కార్లు దగ్ధమయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించడంతో 50 వాహనాలకు ప్రమాదం తప్పింది. ముందుజాగ్రత్తగా పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్‌లోని 90 కుటుంబాలను పోలీసులు ఖాళీ చేయించారు.పక్కనే ఉన్న అపార్ట్మెంట్ వాసులు మంటలను గమనించి ఫైర్ స్టేషన్ కి సమాచారం అందించటం తో నిమిషాల వ్యవధిలో అగ్నిమాపక సిబ్బంది రావడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అగ్నిమాపక సిబ్బంది.. వెంటనే రెండు ఫైరింజన్‌లతో మంటలను అదుపు చేయటంతో ఘోర ప్రమాదం తప్పింది. ప్రమాదానికి షో రూమ్ నిర్వాహకుల అలసత్వమే కారణమని వేస్ట్ ఆయిల్స్, బ్యాటరీలు అన్నీ కలిపి ఒకే దగ్గర పెట్టడంతో ప్రమాదం సంబంధించిందని స్థానికులు అంటుండగా.. ఎవరో ఉద్దేశపూర్వకంగా ఈ పని చేసి ఉంటారని షోరూం నిర్వాహకులు అంటున్నారు.ముందు జాగ్రత్తగా అపార్ట్మెంట్లో ఉన్న 90 ఫ్యామిలీలను పోలీసులు ఖాళీ చేయించారు. షోరూం నిర్వాహకుల అశ్రద్ధ వల్లే ప్రమాదం సంభవించిందని కాలనీవాసులు అంటున్నారు. అయితే ఎవరో ఉద్దేశపూర్వకంగా నిప్పు అంటించి ఉంటారని షోరూమ్ నిర్వాహకులు అంటున్నారు. దీనిపై అత్తాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి సిసిటీవీ ఫుటేజ్ పరిశీలిస్తున్నారు.

## అధ్యక్షా.. ఐ యామ్ నాట్ సాటిస్పైడ్..

## తొలి ప్రసంగంలోనే దుమ్మురేపిన యంగెస్ట్ MLA మైథిలి

**మంత్రిని నిలదీసిన సొంత పార్టీ ఎమ్మెల్యే మైథిలి ఠాకూర్**

బీహార్ శాసనసభ బడ్జెట్ సమావేశంలో ప్రభుత్వ ఆసుపత్రుల దయనీయ పరిస్థితి మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఈసారి, యువ ఎమ్మెల్యే, ప్రఖ్యాత జానపద గాయని మైథిలి ఠాకూర్ ఈ అంశాన్ని చాలా బలంగా లేవనెత్తారు. ప్రశ్నోత్తరాల సమయంలో, ఆమె తన నియోజకవర్గంలోని ఆసుపత్రి శిథిలావస్థను ఉదహరించారు. ప్రభుత్వం లిఖితపూర్వక ప్రతిస్పందనను పూర్తిగా తిరస్కరించారు. కాగితంపై పరిస్థితి బాగానే ఉన్నట్లు కనిపించినప్పటికీ, క్షేత్రస్థాయిలో వాస్తవికత పూర్తిగా భిన్నంగా ఉందని ఆమె అన్నారు. తన నియోజకవర్గంలోని ఆసుపత్రి భవనం చాలా శిథిలావస్థకు చేరుకుందని, ఏ క్షణంలోనైనా పెద్ద ప్రమాదం జరగవచ్చని మైథిలి ఠాకూర్ వివరించారు. పైకప్పు నుండి ప్లాస్టర్ నిరంతరం పడిపోతుందని, గోడలకు పగుళ్లు ఉంటాయని, వర్షాకాలంలో వార్డుల్లోకి నీరు లీక్ అవుతుందని ఆమె అన్నారు. అయినప్పటికీ, రోగులకు అక్కడే చికిత్స అందిస్తున్నారు, గర్భిణీ స్త్రీలను



చేర్చుకుంటున్నారు. పిల్లలను అక్కడే ఉంచుతున్నారు. ఇది ప్రజల ప్రాణాలకు ముప్పు అని ఆమె ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వం లిఖిపూర్వక ప్రతిస్పందనపై తన అసంతృప్తిని వ్యక్తం చేస్తూ, మైథిలి ఠాకూర్ స్పష్టంగా పేర్కొంది, "ఈ ప్రతిస్పందనతో నేను ఏమాత్రం సంతృప్తి చెందలేదు. భవనం దీన స్థితిలో లేదని, దానికి మరమ్మతులు మాత్రమే అవసరమని ప్రభుత్వం తరుపున మంత్రి పేర్కొన్నారు. కానీ పరిస్థితి ఎంత దారుణంగా ఉందో నేను నా కళ్ళతో చూశాను." అని మైథిలి మండిపడ్డారు. ఆసుపత్రిలో ఒక చిన్న గదిలో ఆరోగ్య సేవలు నిర్వహిస్తున్నారని, ప్రస్తుతం MBBS వైద్యులు లేరని ఆమె వివరించారు. గతంలో ఇద్దరు వైద్యులు ఉండేవారు, కానీ ఇప్పుడు ఎవరూ అందుబాటులో లేరని తెలిపారు.



## రేవంత్ రెడ్డికి బిజెపియే దేవుడు

**రామచందర్ రావు**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై తెలంగాణ బిజెపి అధ్యక్షుడు రామచందర్ రావు స్పందించారు. బిజెపికి ఓవైసీ దేవుడు అంటూ ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలను ఆయన తప్పుబట్టారు. రాజకీయ దాడుల కోసం ప్రతిసారీ బిజెపి పేరును వాడుకుంటున్న రేవంత్ రెడ్డికి అసలు బిజెపియే దేవుడని ఆయన పేర్కొన్నారు. బిజెపి అధికారంలోకి వస్తే ముస్లింలకు ముప్పు ఉంటుందని భయపెడుతూ రేవంత్ రెడ్డి రాజకీయం చేస్తున్నారని, కానీ బిజెపి అధికారంలో ఉంటేనే ‘సబ్ కా సాత్ సబ్ కా వికాస్’ సాధ్యమవుతుందని తెలిపారు. కాంగ్రెస్, ఎంఐఎంలు రాజకీయాల్లో విడదీయలేని సోదరులని, వారి మధ్య ఉన్న బంధం జగమెరిగిన సత్యమని రామచందర్ రావు విమర్శించారు.

## క్యూలైన్లను విరగ్గొట్టి.. శివస్వాముల ఆందోళన



మహాశివరాత్రి పర్వదినం సమీపిస్తున్న వేళ.. శ్రీశైలం మల్లన్న ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. మహాశివరాత్రి నేపథ్యంలో ఆదివారం నుంచి శ్రీశైలంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. దీంతో మల్లన్న దర్శనం కోసం సాధారణ భక్తులు, శివస్వాములు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. ఈ క్రమంలోనే సోమవారం రోజున శ్రీశైలం ఆలయంలో శివభక్తులు నిరసనకు దిగారు. స్పర్శ దర్శనానికి ఆలస్యమవుతోందని ఆరోపిస్తూ శివస్వాములు ఆందోళన చేశారు. ఈ క్రమంలోనే కృష్ణదేవరాయ క్యూలైన్లు విరగ్గొట్టి కొంతమంది ముందుకు చొచ్చుకెళ్లారు. శ్రీశైలం పుష్కరిణి వైపున ఉన్న గేట్లు ఎక్కి దేవాలయంలోకి వస్తున్నారు. మరోవైపు శివస్వాములను కట్టడి చేయలేక సిబ్బంది ఇబ్బందులు పడ్డారు. మరోవైపు దేవస్థానం ఏర్పాట్లు, దర్శనం విధానాలపై శివస్వాములు మండిపడుతున్నారు. వీఐపీ దర్శనాలకు ఎక్కువ సమయం కేటాయించడంతో క్యూలైన్లలోనే ఆందోళన చేపట్టారు. భక్తులతో క్యూలైన్లు కిక్కిరిసిపోవటంతో ఈవో డౌన్ డౌన్ అంటూ నినదించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా చర్యలు తీసుకోలేదని.. ఏర్పాట్లు సరిగా చేపట్టలేదని మండిపడ్డారు.




## 700 కోట్ల విలువైన భూమిని కాపాడిన హైడ్రా

విపత్తు నిర్వహణ, ప్రభుత్వ ఆస్తుల రక్షణ కోసం ఏర్పాటు చేసిన స్వతంత్ర సంస్థ హైడ్రా.. హైదరాబాద్ నగరంలోని కొండాపూర్‌లో రూ.700 కోట్ల విలువ గల భూమిని కాపాడింది. శేరిలింగంపల్లి మున్సిపల్ కార్యాలయం నుంచి మదీనాగూడ మార్గంలో ఆపరేషన్ నిర్వహించిన హైడ్రా అధికారులు.. స్థానిక జంగమోనికుంట ప్రాంతానికి చెందిన 4 ఎకరాల భూమిని ఆక్రమించి, మట్టి పోసి ప్లాట్లుగా మార్చి అమ్మకానికి సిద్ధం చేసుకున్న కబ్జాదారులపై కేసు నమోదు చేశారు. ఫిర్యాదుల నేపథ్యంలో హైడ్రా అధికారులు కుంట చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి భూమిని రక్షించారు. హైడ్రా చర్యలు భూవినియోగంలో అక్రమ కబ్జాలను నిరోధిస్తూ, స్థానికుల హక్కులను రక్షించడంలో కీలక పాత్ర పోషించాయి.

## అత్తను కరెంటు షాక్‌తో చంపిన అల్లుడు



మహబూబాబాద్ జిల్లా గార్ల మండలంలోని సీతంపేట మంగళి తండాలో సోమవారం రాత్రి దారుణమైన ఘటన చోటుచేసుకుంది. అల్లుడే అత్తను కరెంటు షాక్ పెట్టి ప్రాణాలు తీసిన సంఘటన స్థానికంగా కలకలం రేపింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడుకు చెందిన కౌసల్య (50) తన అల్లుడు రాజేష్ పిలుపు మేరకు సీతంపేటలోని అతని ఇంటికి వెళ్లారు. ఉద్దేశపూర్వకంగా ఆమెకు కరెంటు షాక్ ఇచ్చి అత్యంత దారుణంగా హత్య చేశాడు. అత్తమామలను ప్రత్యేకంగా ఇంటికి పిలిపించి మరీ ఈ ఘాతుకానికి పాల్పడటం పలు అనుమానాలకు దారితీస్తోంది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, రాజేష్‌పై కేసు నమోదు చేశారు. హత్యకు గల పూర్తి కారణాలు తెలియాల్సి ఉంది.



## సమంత న్యూ హాట్ లుక్స్

స్టార్ హీరోయిన్ సమంత రుత్ ప్రభు ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత జీవితం, కెరీర్ గురించి నిర్మొహమాటంగా మాట్లాడారు. తాను పరిపూర్ణరాలును కానని, తప్పులు చేశానని, దెబ్బలు తిన్నానని ఆమె అంగీకరించారు. అయితే, ఇప్పుడు మెరుగవుతున్నానని చెప్పారు. తన జీవితంలో జరిగిన ప్రతీ సంఘటన ప్రజల సమక్షంలోనే జరిగిందని, విడాకులు, ఆరోగ్య సమస్యల వంటి సందర్భాలలో ఎదుర్కొన్న ఇబ్బందులను గుర్తు చేసుకున్నారు. ఆ సమయంలో సోషల్ మీడియా ట్రోల్స్ తనను ఎంతగానో వేధించాయని, కొందరు తన వ్యక్తిత్వంపై తీర్పులు కూడా ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు.

నేటి దినపత్రిక సూర్య www.suryaa.com EVENING EDITION 4PM




## కవిత కొత్త పార్టీ.. సీఎం రేవంత్ రియాక్షన్

కల్వకుంట్ల కవిత కొత్త పార్టీ పెడతారని వస్తున్న వార్తలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తనదైన శైలిలో స్పందించారు. ఇప్పటికే తెలంగాణ జాగృతి పేరుతో ఆమె జిల్లాల పర్యటనపైనా రియాక్ట్ అయ్యారు. కేసీఆర్‌తో, బీఆర్ఎస్‌తో బంధాలు, సంబంధాలు తెంచుకోవడంపైనా కొన్ని వ్యాఖ్యలు చేశారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారం ముగియడానికి ఒక గంట ముందు ఆయన మీడియాతో సమావేశం నిర్వహించారు. అనంతరం పాత్రికేయులతో జరిపిన చిట్‌చాట్ సందర్భంగా కేసీఆర్ ఫ్యామిలీపైనా, కల్వకుంట్ల కవిత కొత్త పార్టీ ప్రయత్నాలపైనా స్పందించారు. ''కవిత ఆమె తన పంచాయతీని ఇంట్లో పరిష్కరించుకోవాలి.. ఇంట్లో ఆడబిడ్డను మంచిగా చూసుకోవడం తల్లిదండ్రుల పని.. తోడబుట్టినవారి బాధ్యత.. మహిళను పుట్టింటివారు చీర, సారె పెట్టిగౌరవించాలి.

## కుక్కల గురించి మాట్లాడతారు, పిల్లల గురించి మాట్లాడరా

తెలుగు రాష్ట్రాల్లో కొద్దిరోజులుగా వీధి కుక్కల సంరక్షణ అంశం హాట్‌టాపిక్ అయ్యింది. కొందరు సెలబ్రిటీలు వీధి కుక్కల్ని సంరక్షించాలని బాధ్యత ఉందని కామెంట్స్ చేస్తుంటే.. మరికొందరు మాత్రం వీధి కుక్కలు మనుషుల, పిల్లలపై దాడి చేస్తుంటే వాటిని ఎలా సంరక్షిస్తారని ప్రశ్నిస్తున్నారు. శునకాల గురించి డిబేట్ జరుగుతున్న వేళ వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి ఆరె శ్యామల ట్వీట్ హాట్‌టాపిక్ అయ్యింది. కుక్కల సంరక్షణ గురించి మాట్లాడే సెలబ్రిటీలు.. గిరిజన బిడ్డల గురించి ఎందుకు మాట్లాడం లేదు అంటూ ట్వీట్ చేశారు. 'కుక్కల సంరక్షణపై మాట్లాడడానికి మనకు ఎందరో సెలబ్రిటీలు ఉన్నారు.. కానీ గిరిజన బిడ్డల గురించి మాట్లాడడానికి ఎవరూ లేకపోవడం దౌర్భాగ్యం!. గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఉడకని ఇడ్లీ , నిల్వ చట్నీ.. 89 మంది విద్యార్థులకు తీవ్ర అస్వస్థత. రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో 70 మందికి చికిత్స.. ఒకే మంచంపై నలుగురైదుగురికి సెలైన్లు. ఆశ్రమ పాఠశాలల్లో మరణమృదంగం మోగుతున్నా.. తీరు మారని బాబు సర్కారు.. గిరిజన విద్యార్థుల



ఆరోగ్యాలతో చెలగాటం. కూటమి అధికారం చేపట్టాక ఏపీలో ఇప్పటివరకు సరైన ఆహారం , మంచినీరు , వైద్యం లేక.. 50 మంది వరకు మరణించారు.. వందలమంది అనారోగ్యం బారిన పడ్డారు. దీనిపై ఏ మీడియాలోనూ చర్చలు జరగవు.. ఏ మేధావులూ మాట్లాడరు. కుక్కల సంరక్షణపై మాట్లాడడానికి మనకు ఎందరో సెలబ్రిటీలు ఉన్నారు.. కానీ గిరిజన బిడ్డల గురించి మాట్లాడడానికి ఎవరూ లేకపోవడం దౌర్భాగ్యం' అంటూ ట్వీట్ చేశారు. వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిది ఆరె శ్యామల ట్వీట్ పరోక్షంగా.. సినీ నటి, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మాజీ సతీమణి రేణూదేశాయ్ కుక్కల సంరక్షణ గురించి ఇటీవల చేసిన వ్యాఖ్యల్ని పరోక్షంగా ప్రస్తావించారా అనే చర్చ జరుగుతోంది. కుక్కల్ని సంరక్షించాలని బలంగా వాయిస్ వినిపిస్తున్న వాళ్లు గిరిజన పిల్లలు, వారి సమస్యల గురించి ఎందుకు మాట్లాడటం లేదని శ్యామల ప్రశ్నిస్తున్నారు. ఇటీవల తెలుగు రాష్ట్రాల్లో వీధి కుక్కల్ని చంపడంపై రేణూ దేశాయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు వీధి కుక్కల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని కోరారు. తాను ఎప్పుడూ వ్యక్తిగత హక్కుల కోసం పోరాటం చేయలేదన.. కానీ కుక్కల విషయంలో మాత్రం తన పోరాటం ఆగదు అన్నారు. ఎక్కడో ఒకటి, రెండు చోట్ల జరిగిన ఘటనలతో కుక్కల్ని చంపాలనడం సరికాదన్నారు. పోలవరం జిల్లా దేవరపల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయ్యింది. శనివారం రోజు ఇడ్లీలు తిన్న విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. కడుపునొప్పి, వాంతులతో ఇబ్బంది పడ్డారు.. వెంటనే మొత్తం 89మందిని ఆస్పత్రికి తరలించారు.



## పాకిస్థాన్ ప్రధానికి ధన్యవాదాలు తెలిపిన శ్రీలంక అధ్యక్షుడు

టీ20 వరల్డ్ కప్ లో ఉత్కంఠకు తెరపడింది. ఇండియాతో ఆడేందుకు పాకిస్థాన్ సుముఖత వ్యక్తం చేసింది. ఫిబ్రవరి 15న కొలంబోలో జరిగే మ్యాచ్ లో ఇండియాతో ఆడేందుకు పాక్ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ కు శ్రీలంక అధ్యక్షుడు దిసనాయకే ధన్యవాదాలు తెలిపారు. ఇండియాతో ఆడాలని పాక్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్టు శ్రీలంక అధ్యక్షుడు తెలిపారు. పాకిస్థాన్ తీసుకున్న నిర్ణయం పట్ల సంతోషంగా ఉన్నామని చెప్పారు. తాము కోరుకున్నట్టుగానే కొలంబోలో ఇండియా - శ్రీలంక మ్యాచ్ జరగబోతోందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ట్వీట్ చేశారు. ఇండియాతో ఆడకూడదంటూ తీసుకున్న నిర్ణయంపై పునరాలోచించుకోవాలని పాక్ ప్రభుత్వానికి శ్రీలంక లేఖ రాసింది. అనంతరం పాక్ ప్రధాని షరీఫ్ తో దిసనాయకే మాట్లాడారు. మరోవైపు ఐసీసీతో పాక్ క్రికెట్ బోర్డు చర్చలు జరిపింది. ఈ పరిణామాలన్నింటి తర్వాత ఇండియాతో ఆడేందుకు పాకిస్థాన్ సుముఖత వ్యక్తం చేసింది. ఒకవేళ కొలం బోలో ఇండియా - పాక్ మ్యాచ్ జరగక పోయి ఉంటే... శ్రీలంకకు భారీ నష్టం వాటి ల్లేది. శ్రీలంక టూరిజం ఎంతో నష్టపోయేది. ఈ క్రమంలోనే ఇండియాతో మ్యాచ్ ఆడాలని పాకిస్థాన్ ను శ్రీలంక అభ్యర్థించింది.

## సీఎం రేవంత్‌కు ఆరు నెలలు బోనస్

రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆరు నెలలు అదనంగా కొనసాగనున్నదా?.. 2028 డిసెంబరులో రావాల్సిన అసెంబ్లీ ఎన్నికలు ఆరు నెలలు ఆలస్యంగా వస్తాయా?.. పార్లమెంటు ఎన్నికలతో కలిపే జమిలి ఎన్నికలు జరుగుతాయా?.. 'వన్ నేషన్ — వన ఎలక్షన్' పాలసీలో భాగంగా అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు కలిపే ఉంటాయా?.. ఇలాంటి ప్రశ్నలన్నింటికీ సీఎం రేవంత్‌రెడ్డి నుంచి 'ఔను' అనే సమాధానమే వస్తున్నది. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కసరత్తులో భాగంగా తెలంగాణలో అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు కలిపే జరుగుతాయని మీడియాతో చిట్‌చాట్ సందర్భంగా ఆయన వ్యాఖ్యానించారు. ఐదేండ్లు ఉండాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం మరో అరు నెలల పాటు ఎక్స్ టెండ్ అయ్యే అవకాశాలున్నాయన్నది ఆయన భావన. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కసరత్తు అంతా ఇలాంటి పరిస్థితి ఉత్పన్నం కావచ్చనే డైరెక్షన్‌లో ఉన్నట్లు వివరించారు. పార్లమెంటు నియోజకవర్గాలను డీలిమిటేషన్ చేయడంపై ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం లోతుగా చర్చించింది. తొలుత జనాభా లెక్కల సంఖ్య



తేలితే దానికి అనుగుణంగా కేంద్ర ఎన్నికల సంఘంతో చర్చలు జరిపి, ఆ తర్వాత డీలిమిటేషన్ కోసం ఒక కమిషన్‌ను నియమించడం చేయాల్సి ఉంటుంది. నియోజకవర్గాల సరిహద్దులు, ఒక్కో నియోజకవర్గంలో ఎంత మంది జనాభా ఉన్నది.. ఇలాంటి వివరాలు వచ్చిన తర్వాత మాత్రమే డీలిమిటేషన్ కమిషన్ పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి ఒక స్పష్టతకు వస్తుంది. అది పూర్తయిన తర్వాత ఏ రాష్ట్రంలో ఎన్ని నియోజకవర్గాలను పెంచవచ్చో, దానికి ఏ ఫార్ములా అనుసరించాలో క్లారిటీ రానున్నది.


## గ్లామర్ బ్యూటీ దివ్య భారతి

గోట్ సినిమాతో తెలుగులో అడుగుపెట్టిన గ్లామరస్ బ్యూటీ దివ్య భారతి. ఈ సినిమాలో తన అందం, నటనతో కుర్రకారును కట్టిపడేసింది. ఓపక్క సినిమాలతో బిజీగా ఉంటూనే మరోపక్క సోషల్ మీడియాలో యాక్టీవ్ గా ఉంటుంది ఈ బ్యూటీ. తాజాగా ఈ అమ్మడు తన లేటెస్ట్ ఫోటో షూట్ ను సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఎద అందాలను చూపిస్తూ దిగిన ఈ ఫోటోలు ట్రెండ్ అవుతున్నాయి. మీరు కూడా చూసేయండి.



## ఛార్జీలకు డబ్బులు లేవని.. ఏటీఎంలో చోరీకి ప్రయత్నం

కాకినాడ జిల్లా తునిలోని జీఎన్‌టీ రోడ్డు రామా థియేటర్ దగ్గర బ్యాంక్ ఏటీఎం ఉంది. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఆ ఏటీఎంలోకి ఓ వ్యక్తి వచ్చాడు. ఓ రాయి తీసుకుని ఏటీఎం మెషిన్‌ను పగులగొట్టేందుకు ప్రయత్నించాడు. ఆ తర్వాత ఇనుప చువ్వ సాయంతో డోర్ కూడా ఓపెన్ చేశాడు.. కానీ డ్రామిట్ కథ అక్కడే అడ్డం తిరిగింది. అయితే ఏటీఎం మెషిన్‌లో డబ్బులు ఉండే అసలైన డోర్‌ను తీసేందుకు ప్రయత్నించినా అది ఓపెన్ కాలేదు. అయితే 20 నిమిషాల పాటూ ప్రయత్నం కొనసాగింది. ఏటీఎంలో చోరీ యత్నం మొత్తం అక్కడే సీసీ కెమెరాలలో రికార్డయ్యింది. ఇంతలో దొంగతనం వ్యవహారాన్ని బ్యాంకు సెంట్రల్ టీమ్ గుర్తించింది. వెంటనే ఆ బ్యాంకు బ్రాంచ్ మేనేజర్‌కు సమాచారం ఇవ్వగా.. వారు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. బ్యాంకు అధికారులు, పోలీసులు హుటాహుటిన అక్కడికి వెళ్లారు. అప్పటికే ఆ వ్యక్తి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. అయితే ఏటీఎంలో చోరీకి ప్రయత్నించిన వ్యక్తిని గాలించి పోలీసులు పట్టుకున్నారు. అతడి గురించి ఆరా తీస్తే కీలక విషయాలు తెలిశాయి. ఏటీఎం ఎందుకు పగులగొట్టావని ప్రశ్నిస్తే అసలు విషయం చెప్పాడట. తుని పోలీసులు ఏటీఎం పగులగొట్టేందుకు ప్రయత్నించిన వ్యక్తి జార్ఖండ్‌కు చెందిన రంజిత్‌కుమార్ జాదవ్‌గా గుర్తించారు. రంజిత్ అక్కడ ప్రభుత్వ స్కూల్‌లో కాంట్రాక్ట్ టీచర్‌గా పనిచేశాడు. ఆ ఉద్యోగం రెగ్యులరైజ్ అవుతుందని భావించాడు.. కానీ అది పర్మినెంట్ కాకపోవడంతో ఉద్యోగానికి రిజానమా చేశాడు. అయితే గత రెండేళ్లుగా జాదవ్ మానసిక పరిస్థితి అంతగా బాగోలేదట. అతడు ఇటీవల జార్ఖండ్ నుంచి హైదరాబాద్ వచ్చాడు. అక్కడ ఎల్బీ నగర్‌లో నివాసం ఉంటున్న సోదరుడి ఇంటికి వెళ్లాడు. అయితే రంజిత్ మళ్లీ జార్ఖండ్‌కు వెళ్లేందుకు రైలు ఎక్కాడు. అయితే టికెట్ తీసుకోకపోవడంతో రైల్వే టీటీఈ గుర్తించి.. అతడ్ని కాకినాడ జిల్లా తునిలో దించేశారు. ఈ క్రమంలో చేతిలో డబ్బులు లేకపోవడంతో.. వెంటనే తునిలో తిరుగుతూ డబ్బుల కోసం ఏటీఎంలో చోరీకి ప్రయత్నించినట్లు పోలీసులు తేల్చారు.



## కొడుకును పొడిచి చంపిన తండ్రి

భూమికి సంబంధించి అయ్యకొడుకుల మధ్య జరిగిన గొడవ ఓ నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. తన తండ్రి నుంచి తనకు ప్రాణాపాయం ఉందని ఓ వ్యక్తి పోలీస్‌స్టేషన్‌లో కంప్లెయింట్ ఇచ్చి ఇంటికి తిరిగొచ్చిన కాసేపటికే తండ్రి చేతిలో హత్యకు గురయ్యాడు. ఘటనపై మృతుడి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే.. ఒడిశా రాష్ట్రం దెంకనాల్ జిల్లాకు చెందిన కిరోద్ సాహూ, బిభూటి సాహు అనే తండ్రీకొడుకుల మధ్య చాలాకాలంగా భూతగాదా నడుస్తోంది. ఈ క్రమంలో కిరోద్ సాహూను చంపేస్తానని తండ్రి బిభూటి సాహూ హెచ్చరించాడు. దాంతో కిరోద్ సాహూ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి తన తండ్రి నుంచి తనకు ప్రాణహాని ఉందని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



## రెడ్డి అయినా, రావు అయినా మా దగ్గరికి రావాల్సిందే.. అక్బరుద్దీన్ ఓవైసీ

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనం రేపుతున్నాయి. ప్రస్తుత, గత ముఖ్యమంత్రులను ఉద్దేశించి ఆయన చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారానికి కారణం అయ్యాయి. మున్సిపల్ ఎన్నికల్లో ఎంఐఎం పార్టీ స్టార్ క్యాంపెయినర్‌గా ఉన్న అక్బరుద్దీన్ ఓవైసీ.. ప్రచారం ముగింపు రోజున కరీంనగర్‌లో సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రుల వద్దకు తాము వెళ్లం అని.. వాళ్లే తమ వద్దకు వస్తారని పేర్కొన్నారు. అది రెడ్డి అయినా.. రావు అయినా తమ దగ్గరికి రావాల్సిందేనని తేల్చి చెప్పారు. తాము ముఖ్యమంత్రుల దగ్గరికి వెళ్లాల్సిన అవసరం లేదని.. పనులు కావాలన్నా, అధికారం కావాలన్నా సీఎంలే తమ వద్దకు రావాల్సి ఉంటుందని అక్బరుద్దీన్ వ్యాఖ్యానించారు. తమ సపోర్ట్ లేకుండా రాజకీయాలు చేయడం సాధ్యం కాదని పేర్కొన్నారు. ఎంఐఎం పార్టీ మద్దతు అనేది రాష్ట్రంలో కేవలం ఒక ప్రాంతానికి మాత్రమే పరిమితం కాదని పేర్కొన్న అక్బరుద్దీన్ ఓవైసీ.. తెలంగాణ రాష్ట్ర రాజకీయాలను ప్రభావితం చేసే శక్తి తమ పార్టీకి ఉందని తెలిపారు. ఇక కొన్ని నెలల క్రితం జరిగిన జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో తమ మద్దతు లేకుండానే కాంగ్రెస్ పార్టీ గెలిచిందా అని అక్బరుద్దీన్ ఓవైసీ ప్రశ్నించారు. కాంగ్రెస్ సాధించిన విజయంలో ఎంఐఎం పాత్ర కీలకమని.. దాన్ని హస్తం పార్టీ నేతలు మర్చిపోకూడదని పరోక్షంగా తీవ్ర హెచ్చరికలు చేశారు. తమ ఎంఐఎం పార్టీ అవసరం కాంగ్రెస్ పార్టీకి ఎప్పుడూ ఉంటుందనే విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లోనూ.. ఎంఐఎం బ్రదర్స్ (అసదుద్దీన్ ఓవైసీ, అక్బరుద్దీన్ ఓవైసీ) సత్తా ఏంటో చూపిస్తామని స్పష్టం చేశారు. గతంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను గుర్తు చేసిన అక్బరుద్దీన్ ఓవైసీ.. రానున్న మున్సిపల్ ఎన్నికల్లోనూ ఎంఐఎం పార్టీ కింగ్ మేకర్‌గా నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈనెల 11వ తేదీన జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో ఎంఐఎం పార్టీ తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థులు రాష్ట్రవ్యాప్తంగా అద్భుత ప్రతిభ కనబరుస్తారని పేర్కొన్నారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో తమ పార్టీ బలం ఏంటో ప్రత్యర్థులకు చూపిస్తామని ఎంఐఎం కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసి.. అత్యధిక వార్డులను దక్కించుకోవడమే లక్ష్యంగా ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు.